అంకితము :
నా ప్రేమబావ సోమశేఖరశర్మకు
గాఢాలింగనంతో.

ద్వేషము

రచయిత :
శ్రీ అడవి బాపిరాజు

(ఈ కథ, ఈ కథలోని పాత్రలూ కేవలం కల్పితాలు.)

౧

ఆవేశంతో ఆచిత్రము లిఖిస్తున్నాడు. రంగులు కలపడంలో, కుంచెలు రంగుల్లో ముంచడంలో, కుంచెలతో చిత్రలేఖనం కాగితంమీద చిత్రించడంలో అతి వేగము.

ఆచిత్రం పేరు 'రోడ్డురోలరు' అట. రంగులు 'అంబరు, సియన్నా, పెయన్ సు గ్రే, నీలిమందు, క్రిమిసన్ లేకు' కలిసిన తమస్సును కలిగినవి.

రేఖలు అసాధువులు, కర్కశాలు. రూపాలు వికృతాలు, భయంకరాలు.

హెచ్చుతగ్గులుగా ఉన్న రోడ్డు-ఆరోడ్డును సమం చేయడానికి భారతీయ నర, నారీమణులు రాళ్లు, – శిశువులూ, వృద్ధులూ, వికృతాంగులూ — ఆ రాళ్లమీద నుంచి రోడ్డురోలరు నెమ్మదిగా, నిదానంగా, అత్యధికమైన బరువుగా నడుస్తున్నది. ఆరోలరుబండి పొగలువిడుస్తూ విపరీతమైన చప్పుడు చేస్తూ వెడుతూఉన్నట్లున్నది.

ఆ రోలరుబండి నడిపేవాడు నల్లటి ఎత్తుటోపీ బ్రిటిషురాజ్య తంత్రజ్ఞుడు. రోడ్డుకు ఈ వలావల ఉన్న భారతీయులను ఆంగ్లయుద్ధభటులు, ఆంగ్లవర్తకులు, ఆంగ్లమిషనరీలు కఱ్ఱలతో రోడ్డుమీద పడేటట్లు నెట్టుతున్నారు. బండి వెనుకభాగం రక్తమయం.........

ఆ యువకుడు ఆ చిత్రంపూర్తిచేసి తన పేరు దానిమీద, లిఖించుకొని వెనక్కు వెళ్లి చిత్రాన్ని చూచి కళ్లు సన్నగిల్ల, బొమలు ముడివడ, పళ్లు పటపటకొరుక్కున్నాడు.

విశ్వేశ్వరరావు ఆవేశహృదయుడు. చిన్నతనాన్నుంచీ దేశభక్తి విశేషం.

గాంధీమహాత్ముడు ౧౯౧౯లో అహింసా మహాయజ్ఞం భారతమాతదాస్యశృంఖలవిమోచనార్థం ప్రారంభించిన రోజుల్లో విశ్వేశ్వరుడు పదేళ్ల బాలుడు. అప్పటికే అతనికి తాను ఆంధ్రుణ్ణనీ, బానిస అయిన భారతీయుణ్ణనీ గాఢభావాలు ఆతని మూర్తి మూర్తంతా వ్యాపించిపోయినవి.

ఆతని హృదయం ఆంగ్లజాతిద్వేషంతో నిండిపోయింది. ఆతనికి ద్వేషం మోముమీద మచ్చలా ఉన్నది. చిన్నబిడ్డగుణం వచ్చినప్పుడు కాల్చగా వచ్చిన మచ్చలా ఉన్నది.

ఎక్కడ చూచినా ప్రత్యక్షమయ్యే దారిద్ర్యం, అనాగరకతా, అనారోగ్యపు పరిసరాలు· తెల్లవాడు తెచ్చిపెట్టిన మహాభిక్ష అని ఆతని నిశ్చితాభిప్రాయం.

కర్కశహృదయంతో, స్వలాభాపేక్షతో ఈ ఇంగ్లీషు బందిపోటు భారతజాతీయత, ఐశ్వర్యము, నాగరికతా తరలించుకుపోయినట్లు ఆతని చిన్నహృదయానికి గోచరించింది.

పాఠశాలలు విడిచి బయటకు రావలసిందని మహాత్మాజీ ఆదేశం ఇవ్వగానే బడికి వెళ్లనని పట్టుపట్టి రాజకీయసభలకు పోవడం, స్వచ్ఛందభటులతో తిరగడం ప్రారంభించాడు.

గాంధీగారి బోధనలు ఆతని చిన్న హృదయానికి అర్థంకాలేదు. ఇంగ్లీషువాళ్లను దేశంలోంచి వెళ్లగొట్టడానికి వేసినఎత్తు అనిమాత్రం ఆతడు భావించుకొన్నాడు.

౧౯౨౨ నుంచి మళ్లీ చదవడం ప్రారంభించాడు. ౧౯౩౦ కి బియ్యే పూర్తిచేశాడు.

మళ్లీ శ్రీమహాత్ముడు ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించగానే కదనరంగంలోకి దూకాడు. రెండేళ్లు జైలు. గాంధీ ఇర్విను ఒడంబడిక వెనక వదిలారు.

కాని అతని జీవితము జైలులో పిశాచరూపం వహించింది. జైలులో అతడు తిన్న దెబ్బలు వాతలు కట్టినవి.

విశ్వేశ్వరరావు క్రోధం మిన్నుముట్టింది. తిన్నగా ఉత్తరహిందూస్థానం చేరుకుని లక్నోలో ఒక వర్తకపు దొరమీద ఆకలితో మాడుతూఉన్న తోడేలులా విరుచుకపడ్డాడు.

చేతిలోఉన్న కత్తియొక్క వేగం ఇంకా ఎడమ వైపుకు మళ్లింది కాని, ఆ ఆంగ్లేయుని హృదయం చిమ్మట గొట్టం అయిపోయిఉండేది. విశ్వేశ్వరరావుకు ఇరవై ఏళ్లు ద్వీపాంతర వాసము వరమీయబడింది.

౨

అండమాను ద్వీపాలు చూశాడు. అనేక ఇతర జైళ్లు చూశాడు.

గాంధీమహాత్ముడు సత్యాగ్రహం విరమించమని ఆదేశంఇచ్చి, క్రొత్తచట్టంక్రింద కాంగ్రెసువారిని శాసన సభలకు వెళ్లవలయునని కోరినవెనక, అనేకరాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పాటయినవెనక రాజకీయబంధితు లందరూ బోనుల్లోంచి ఎండిపోయిన శవంగుల్లా వచ్చారు.

అందరూ సత్యమూ, అహింసలయందు తమకు నిశ్చలమైన నమ్మకం కుదిరిందని శపథంచేసే బయటకు వచ్చారు కాని కొందరికిమాత్రం వాళ్లహృదయాలల్లో ద్వేషం దాగేఉన్నది. కొందరు దాచుకొన్నారు. ఆదాచుకొన్న వాళ్లలో విశ్వేశ్వరరావు ఒకడు.

అనేక ఖైదులు చూశాడు. అనేక రకాల కూడులు కుడిచాడు. కొరడాదెబ్బలు తిన్నాడు. అడ్డబేడీల్లో, నిలువుబేడీల్లో, గోడకుర్చీల్లో చీకటి కొట్లల్లో పిశాచరూపం దాల్చాడు. పై పెదవి పైకి పోగా క్రింది పెదవి క్రిందికి పోగా, ముక్కుపుటాలు విస్ఫారితంకాగా, కళ్లుకాయలుకానిపోగా, "ఖాం-ఖాం" అని బుసలుకొట్టాడు. ఉపవాసవ్రతాలు చేశాడు. బలవంతంగా ద్రవాహారము ఇచ్చారు. కొన ఊపిరితో బయటపడుతూ ఉండే వాడు.

అతని హృదయంలోని దవానలం గాంధీమహాత్ముని చల్లని మాటలతో చల్లారలేదు; ఇంటిదగ్గిర తన వాళ్ల ప్రేమచూపుల్లో మాయమైపోలేదు.

రైల్లో బిచ్చగాళ్లు, ఋణవిమోచన చట్టం, గాలివాన, పొలాలవరదలు, ఎగిరిపోయిన ఇళ్లు, చచ్చిపోయిన జంతువులు, అన్నీ తెల్లవిషాని ఛాయలే.

ఈ తెల్లని పాము భరతదేశం అంతా నిండింది. దానికి లక్షలు లక్షలు నాల్కలు. ఆ నాల్కలు చిన్నపిల్లాళ్లని రుచికి నాకుతున్నవి. కూలీలపై ఆడుతున్నవి. చదువుకొని ఉద్యోగంలేని యౌవనవయస్కులను పీల్చి పాలిపోచేస్తున్నవి.

అతని ఆస్తి పెద్దది కాకపోయినా ఆకారం పెద్దది. అందంలేని జీవితమైనా మూర్తిమాత్రము ఆర్యజాతిరేఖలు పుణికి పుచ్చుకొన్న సౌష్టవం కలిగిన సౌందర్యము. కళ్లల్లో తాలిమిలేదు. హింసితకాంతులు కృత్తికానక్షత్రయుక్తసూర్యుని కిరణాలతీక్షణతతో కనురెప్పలమీద తాండవిస్తుంటవి.

జైలులో వున్నన్నాళ్లూ చదువుమాత్రం చక్కగ నేర్చుకున్నాడు. ఫ్రెంచి, జర్మనీ, ఇంగ్లీషు భాషలూ, ఉరుదూ అరవం భాషలూ మంచినీళ్ల ప్రాయం చేసికొన్నాడు. అనర్గళధారతో మాట్లాడుతాడు, వ్రాస్తాడు.

ఖైదునుంచి రాగానే చక్కనిపిల్ల నొకదాన్ని కట్టబెడితే చెదరిపోయిన మనసు కుదుటపడుతుందని మంచి సమ్బంధాలు రెండు మూడు తీసుకవస్తే విశ్వేశ్వరరావు — ఇష్ ఇష్ — అన్నాడు.

3

అతని జన్మమంతా నిండిపోయిన కోపానికి విరుగుడు కన్పడటం లేదు. ఏం చెయ్యాలో అతనికి తోచటంలేదు. తనబోటివారిని పదిమందిని కలేసి ఒక పార్టీ చేదా మనుకున్నాడు. నడపబడేవారూ లేరూ —

నడిపే మొనగాడూ లేడు. పదిమందిలోనూ తనకున్న భావాలు గట్టిగా మాట్లాడటానికి వీలులేదు. తెల్లవాళ్ల బానిసత్వ ప్రచారానికి గాంధి మహాత్ముడు ప్రధానవ్యాసంవంటివాడనుకొన్నాడు.

ఇలాంటి యినుమునిప్పుల విశ్వేశ్వరరావుకి ఒక్కటే నీరసగుణం వుంది. శిల్పమన్నా, చిత్రలేఖనమన్నా, సంగీతమన్నా గబగబవెళ్లే అడుగు ఖంగున ఆగిపోతుంది. క్రిందికి తిరిగివున్న పెదవుల రేఖలు ఒకొక్కప్పు డొకవైపునా, ఒకొక్కొక్కప్పుడు రెండువైపులా ప్రసరించి, అతని మొహాన్ని వెన్నెల చేస్తవి. వేసంకాలపు మధ్యాహ్నంనాటి అతని జీవితం మాఘపూర్ణిమనాటి నిశిరాత్రి ఔతుంది.

ఎల్లోరాలూ, అజంతాలూ చూస్తూ, ఆంగ్లేయులని ద్వేషించవలసిన కాలమంతా కళలలో మునిగి వృథాపుచ్చటం తప్పని వాదించుకుంటాడుగాని కళలమస్య ప్రతిహింసాత్మకమైన కలలు బాగా కనవచ్చని సమాధానం చెప్పుకుంటూ దక్షిణాదినివున్న సుళ్లూ గోపురాలూ, శిలలూ, శిల్పాలూ, విగ్రహాలూ వితానాలూ, చెక్కడాలూ చిత్రలేఖనాలూ దర్శనం చేస్తూ గడుపుతున్నాడు జీవితం విశ్వేశ్వరరావు.

౪

బొంబాయి పట్టణంలో అలెగ్జాండ్రా రేవులో 'పి. అండ్. ఓ' కంపెనీవారి క్లియోపాత్రా అనే పెద్దవోడ వొడ్డుకు వచ్చి చేరింది. మెట్లు దింపినారు. ఓడలోనుంచి క్రిందకి మొట్టమొదట దిగినవారు పదిమంది ఆంగ్లస్త్రీలు.

హిందూదేశ విచిత్రకళాసౌభాగ్యాన్ని దర్శించి చూరగొనిపోదామని జట్టుగ వారందరూ ఈ శీతకాలంలో బొంబాయిపట్టణంలో అడుగుపెట్టారు. అందరూ వున్నతకుటుంబాలకు చెందినవారే! చదువుకున్నవాళ్లు! డబ్బుగలవాళ్లు! ఇరవై ఏండ్లదగ్గరనుంచీ ముప్పై ఏండ్లవరకూ వున్న విలాసవతులు వాళ్లు. పెండ్లిండ్లు చేసికోవడం స్వాతంత్ర్యానికి భంగకరమని పూర్ణంగ నమ్మిన పూవుబోడులు.

ఈ జట్టుకు నాయకురాలు 'మార్గరెట్టు సల్లివాన్'; ముప్పైయేండ్లపడుచు. ప్రపంచంలోకల్లా అందమైన దేశం హిందూదేశమని ఆమె నమ్మకం. హిమాలయపర్వతం, 'షాలీమార్' తోటలు, 'తాజ్ మహాల్', 'అజంతా', వీని యన్నింటికీ తలమాణిక్యం గాంధీ మహాత్ముడు. ఇవి చాలవా ప్రపంచానికి ఒక దేశాన్ని నాయకమణిగ చేయటానికని ఆమెవాదన.

బొంబాయినుంచి తిన్నగ శివగ్రామానికి వెళ్లి వారు గాంధీగారిఆశ్రమానికి చేరుకున్నారు. పదిహేనురోజులా ఆశ్రమంలో, ఆశ్రమవాసులందరితోపాటు ప్రార్థన సమయానికి ప్రార్థనలకు వెళ్లుతూ అప్పుడప్పుడు గాంధీ మహాత్మునితో సత్యాగ్రహం, ప్రేమ, సంతాననిరోధం, యూదులు, ప్రపంచయుద్ధం, భారతజాతీయత, భగవద్గీత మొదలైన విషయాలనుగురించి ఆ అవతారపురుషుని అభిప్రాయాలు చూరగొంటూ కాలం గడిపారు. వృత్తి ఆధారవిద్యనుగురించి తెలుసుకొన్నారు.

మగన్వాడి, నల్వాడి, విద్యామందిరం మొదలైన ప్రదేశాల తీర్థయాత్రలు సాగించి ఆ తెల్లస్త్రీలు గాంధీ మహాత్ముని మహత్తత్వాన్ని అర్థంచేసుకోనేందుకు ప్రయత్నంచేశారు. అక్కడున్న ఆ పదిహేనురోజులూ ఆశ్రమవాసులూ, ఇతర గాంధీశిష్యులూ వాళ్లకు చూపించినగౌరవం, మర్యాద వాళ్ల హృదయాలను ద్రవింపజేశాయి.

డెబ్బయ్యేళ్లుదాటిన ఆ ముసలివాడు, బోసినవ్వులతో చిన్నబిడ్డలా ఉన్నవాడు, దివ్యమయిన కళకాంతులతో అవతారపురుషుని లా తేజరిల్లేవాడు, జ్ఞానపూర్ణమయి, స్పష్టమయి, ప్రేమసుధారసాలు నిండినవాక్కులు కలిగినవాడు మోహనదాసు వాళ్లకళ్లకు అపరయేసు దేవుడులా కనబడ్డాడు.

వాళ్లజట్టులో ఇరవైయొక్క యేళ్లు నిండిన మేరీ టెంపిల్ అని ఓఅమ్మాయి ఉంది. ఆ అమ్మాయి బంగారు అందంపిల్ల; బంగారుజుట్టు, విశాలమైన నీలికళ్లు. పరువం పండించుకొన్న స్నిగ్ధమయిన ఉత్తమజాతిదంతంలా ఉన్నవొళ్లు. ఆమె అందాలలో హిమవాలుకలు కరిగిపోతూఉండేవి. ఆమె పెదవుల్లో కాశ్మీరకుసుమ

వర్ణం జీరలు పోయేది. సన్నని పొడుగాటి ముక్కు, కోలమోము, గులాబీరేకల చెవులు, ఎప్పుడూ నవ్వుతూ జీవితరహస్యసౌందర్యం ప్రతిఫలించే ఫాలము ఆమెకు దివ్యసౌందర్యం నివేదన లిచ్చినవి.

మేరీకన్య ఎదుటివాడు మాటాడుతూ ఉండ గానే అతని భావం గ్రహించేది. తనకు ఏవిషయమ యినా నచ్చితే మళ్లీ దానినిసురించి తర్జనభర్జన చేసుకు నేది కాదు. ఏ కార్యమయినా తన ఆలోచనాపథంలో మెరుములా ప్రత్యక్షమయితే ఆకార్యం నిర్వహించు కొన్నదాకా నిద్రపోయేది కాదు. అఖిల ప్రపంచశాంతి సంఘాధ్యక్షురాలయిన మార్గరెట్ సల్లివాన్ శిష్యురాలు. మార్గరెట్ సల్లివాన్‌కు గాంధీమహాత్ముడు దేవు డాయెను. అందువల్ల గాంధీమహాత్ముడికి చెందిన జాతిలో ఉన్న మనుష్యులంతా భగవంతుని పక్కనున్న దేవతల వంటి వాళ్లనే ఆమె ఉద్దేశం. బొంబాయిలో దిగినప్పుడు, రైళ్లల్లో ప్రయాణాలు చేస్తున్నప్పుడు, హోటళ్లలో భోజనాలు చేస్తున్నప్పుడు కొందరు మనుష్యులు తమ్ము మోసంచేస్తున్నారని ఆమెకు తెలిసినప్పటికీ తన సిద్ధాంతానికి ఏదో కొంచెం వ్యతిరేకం సంభవించిందనే భావమే కాని భారతీయులయెడ ఆమెకున్న ప్రసన్నతా భావానికి ఈ షణ్మాత్రమైనా జంకు కలుగ లేదు.

భరతదేశపు ఆకాశంలోని నీలిమ 'లెపిస్ లజూలి' శిలకన్న ఎక్కువ కాంతిమంత మయినదట. భరత దేశంలోని నదీనదాల నీరు గ్రీకుదేవతల 'ఆంబ్రోసియా' (అమృతము)ట. భరతదేశంలోని పువ్వులయొక్క వాసన స్వర్గధామంలోకూడా దర్శన మవుతుందో లేదోఅని ఆమె కనుమానం. రెండుచేతులూ జోడించి ఆమె జోహారులివ్వడం నేర్చుకొంది. 'సుజలాం సు ఫలాం మలయజశీతలాం'అని పాడుతూ పులకరించక పోయేది.

జీనెట్టి మేక్డొనాల్డుగొంతుకకు వన్నెలు దిద్దే గొంతుకతో 'వైష్ణవజనతో' అని పాడుకొంటూ కళ్లు అరమూతలు చేసుకొని, వణకిపొయ్యేది. ఆంగ్లస్త్రీ లందరు మీరాబెన్నులయితేనే కాని ఇంగ్లండుకు మోక్షం లేదని ఆమె నిశ్చితాభిప్రాయము.

౫

ఉదయ సంధ్యానృత్య పరవశుడయిన నటేశ్వ రుని పదకింకిణీరవాలు రామప్ప చెరువు చిరుకెరటా లలో లీనమై పోయినవి. లూయీబోధం బొగైన్ విల్లా పూలయొక్క కుంకుమవర్ణం, తెరలుకట్టి ప్రత్యూష మంగళ గీతికారవాలను నేపథ్య గాంధర్వ మొనరిస్తు న్నది. ఉదయకాదంబినీమూర్తియొక్క అవ్యక్త రూపాలనుంచి ఉదయనృత్యాలోకనాభిలాషు లయిన దివ్యులు అనిమిషులై చూచుచూపుతున్నారు. అంగ హార వివిధ కరణోపేతమైన అభినయ లాస్యయుక్తలై అప్సరసలు పరమనటునకు హంగుచేస్తున్నారు. రామప్ప దేవాలయంలో ప్రత్యక్ష మవుతున్న ఈ దివ్య లీలనంతా దర్శించడానికి గాఢాభిలాషులై మార్గ రెట్ సల్లివాన్ జట్టువారు ఆ తెల్లవారకట్లకే ఆ దేవాల యానికి వేంచేశారు.

కారులు దిగడంతోనే అందరికన్న ముందుగా పరు గెత్తుకు వెళ్లా లని అయిదంగల్లో వంతెన దాటింది, సింహద్వారం దాటింది, మండపం చేరుకొంది మేరీ టెంపిల్. ఆ మండపంముందర శిల్పవైభవం చాటే స్తంభాలు! ఆ స్తంభాలకు శిఖర స్వరూపాలుగా నాట్యం చేసే నల్లరాతి శిల్పకన్యలు! —ఆ శిల్పసుంద రుల నాట్యభంగిమ రేఖావిలాసాలను చూసి నిస్తబ్ధురా లైపోయింది మేరీ. ఆ శిల్పబాల లందరలో ఒక మనోహరాంగి తన అందంతో మేరీసుండెను చిదిమి వేసింది. తదేక దీక్షతో ఆలాగే చూస్తూ ఆమె నిలబడి వుంది.

తన వెనకాల ఏదో చప్పుడయినట్లు కాంచి, చటుక్కున వెనక్కు తిరిగింది మేరీ. విషాలు క్రక్కే చూపులతో రెప్ప వాల్చకుండా తనకేసి చూస్తున్న ఒక యువకుడు బిరబిగిసి నిల్చిఉన్నాడు.

"అపశ్రుతిలాగ ఇక్కడ దాపురించా వేమిటి?"

తెల్లబోయి మేరీ టెంపిల్ మాటాడలేక పోయింది.

"దేశమంతా పిప్పిచేస్తూ ఎక్కడో మూల దా క్కొనిఉన్న ఈ కాస్త కళనూకూడా నమిలివేయ డానికి వచ్చిన తెల్ల రాక్షసిలా గున్నావే నీవు?"

మేరీ భయంచేత కుంచుకుపోయింది. అందమైన ఆమె పెదవులు అప్రయత్నంగా విడివడి పోయాయి.

"నీ దేశం పోయి మమ్మల్ని అపహాస్యం చేయడానికి మేమోపిశాచంలాగ ఇక్కడి కెందుకు వచ్చావు?"

బిర్రబిగుసుకుపోయి మేరీ రాయిపడి శిలావిగ్రహంలా అయిపోయింది.

ఇంతట్లో తక్కిన జట్టువాళ్లంతా అక్కడికి వచ్చారు. వాళ్లందర్నీ చూస్తూ అసహ్యంచేత కనుబొమలు ముడుచుకుపోగా, పైపెదవి పైకి తిరిగిపోగా, ఆ యువకుడు విసవిస నడిచి చక్కాపోయాడు.

మార్గరెట్ సల్లివాన్ మేరీని చూసి, ఆ అబ్బాయి ఏమిటి నీతో ఇంగ్లీషుతో మాటాడుతున్నాడని ప్రశ్న వేసింది.

ఎక్కడో నీలాకాశంలోనుంచి ఊడిపడిన పిడుగుదెబ్బ తిన్నదానిలా చైతన్యం తప్పిఉన్న మేరీ మార్గరెట్ మాటలను వినిపించుకో లేదు.

"మేరీప్రియా! ఏమిటే అలా చూస్తున్నావు—పామును చూసి భయపడే పాశ్చాత్యునిలా?"

"తళుక్కుమని దెయ్యంలా మాయమైన ఆ కుర్రాడేమయినా అన్నాడా నిన్ను? వాడిమాటలు మాకు కొంచెం కోపంగానే వినిపించాయి" అని మేరీని వీపు తట్టుతూ మళ్లీ పలకరించింది మార్గరెట్.

మూలమూలలకు చెదిరిపోయిన ధైర్యశక్తిని నెమ్మదిగా చేరదీసికొని, గుండెల్లో పదిలపర్చుకొని మేరీ వెలవెలపోయే చిరునవ్వు నవ్వింది.

"ఆఁ! ఆఁ! ఏమిటీ అన్నావు మార్జీ! అబ్బే, ఏమీ లేదు. ఆకుర్రాడు ఏమన్నాడో నాకూ వినపడలేదు. ఈ ఉదయపు చిరిచీకట్లలో ఎవరూ లేరుకదా అని నేను వస్తే ఆ అబ్బాయి కనపడ్డంచేత భయపడ్డాను. అంతే."

ఇంతట్లో హెలెన్ అనే అమ్మాయి "ఏమి అందగా ఉందే ఈగుడి! ఏమి అందంగా చెక్కాడు నందుల్ని. ప్రతి స్తంభంపైనా తనకున్న కళంతా ధారపోసి నాట్యంచేసే ఈ స్త్రీవిగ్రహాలను చెక్కినవాడు ఎంతటి మహా శిల్పికదా!" అని అన్నది.

సుసి— "రాతిలో చెక్కాడా, రాతిని కరిగించి పోత పోశాడా?"

నెల్లి— "ఇవి రాతిబొమ్మలు కావర్రా;—శాస్త్రజ్ఞానం అంతా కనబరచి ఇనుము కరిగించి తయారుచేసిన బొమ్మలు గాని!"

మేరీ— "ఆ దేహరేఖలు, ఆ శరీరసౌష్టవం, ఆ విచిత్ర భంగిమ, ఆరాతితనంలోని నలుపును మరపింపజేస్తున్నవికదా? రక్తం పొంగెత్తుకువస్తూ, స్నిగ్ధమై, సిక్తకమయిన ఆమె శరీరమే కనబడుతోంది. ఈవేళ్లతో ఆమెను అంటుకొంటే ఆమె ఎంత మార్దవంగా ఉంటుందో!"

మేరీ అప్పుడు వెనక్కి తిరిగి చూసింది. విశ్వేశ్వరరావు దూరంగా ప్రాకారపుగోడదగ్గర నిలవబడి వాళ్ల సంభాషణ వింటూ తెల్లవాళ్ల మీద ద్వేషం ఒకనిమేషమాత్రం మరచిపోయి, భారతీయకళను నిర్మలహృదయంతో అభినందిస్తున్న వాళ్ల మాటలలోని పూజ్యభావానికి సంభ్రమించిపోయాడు. మేరీవంక తదేకదీక్షతో చూస్తున్నాడు. అప్పుడాతని మోములో ఆశ్చర్యానందవర్ణాలుతప్ప ద్వేషవైవర్ణ్యం ఏమీ గోచరించడంలేదు. ఒకచిరునవ్వు ఒకచిన్న మేఘంలోని చిరుమెరుములా కలకలమంటున్నది. ఆసమయంలో అతన్ని మేరీ చూసింది.

పెద్దపులో, తాచుపామో, పిశాచమో అని అనుకొని భయంపడ్డ ఆబాలికకూడా అతనికి తెలియకుండానే అతన్ని ఆవరించిన ఆనందజ్యోత్స్నను చూచి ఆశ్చర్యహృదయురాలైనది. ఆక్షణంలో ఉన్నత రూపుడై, గంభీరరేఖాసమంచితుడైన ఆతనిరూపం అతన్ని ఆమెకు దివ్యుణ్నిగా కనబర్చింది. సుమనస్కురాలైన ఆ పాశ్చాత్యబాలకు విశ్వేశ్వరుని హృదయం ప్రస్ఫుటంగా ద్యోతకమయింది, ఆమె కప్పుడు గుడిలేదు. హిందూదేశం లేదు. ఇంగ్లండు లేదు. కాలపథాలలో ఒకయెడ మధురిమలు ఆవహించిన యువతి ఆమె. దూరదూరాన ఆమహానిర్జనస్థలంలో దివ్యుడయిన పురుషమూర్తి అతను.

ఆమెబుద్ధినుంచి జాతి తెరలు పటపటమని క్రిందకు జారి కూలి పడిపోయినవి.

౬

ఇంతకుముందే ఎంత కర్కశంగా తిట్టినాడు? ఎవ రితను. ఎందు కితనికి ఇంతకోపం? ఈదేశంలోని యువకులంతా తెల్లవాళ్లనిచూస్తే, బ్రిటిషువారిని తలచు కుంటే ఇంత విషపూరితమైన ద్వేషంతో చూస్తూ ఉంటారా? యూదులంటే హిట్లరుకోపంవంటిదా వీరి ద్వేషం?

ఆతనిది ఎంతచక్కని విగ్రహం! మేరీ హృదయ నేత్రానికి ఇంగ్లండులోని తనయువకస్నేహితు లందరూ జ్ఞాపకం వచ్చారు. మనకువల్లే వాళ్లూ ఆంగ్లశాక్సనుజాతికి చెందినవాళ్లు. జాతులన్నింటిలోకి ఆంగ్లశాక్సను, జర్మనీ, నార్డు జాతులు ఉత్తమమైనవి. వాళ్లవొళ్లు దేవతలవొళ్లు. స్వచ్ఛమై, నిర్మలమై, సాయంకాల కుంకుమవర్ణాలు ప్రసరించిన ధవళహిమంలా ఉన్న దేహాలు దేవతలవికాక మరెవరివి?

గుణగణాలలో ఆంగ్లశాక్సనుజాతి ఉన్నతపథాలల్లో లేదా? ఆజాతివారు అబద్ధాలాడరు, అన్యాయాలు చేయరు. వారి గంభీరత, రాజఠీవి, వీరత్వము, సర్వకళల యందూ ఆరితేరినతనము, సర్వదేశాలను అరికట్టి నిల బెట్టిన రాజనీతి.

భారతీయులలో ఉన్న అద్భుతత్వము ఏమిటి?...

అనేకయుగాలనుంచీ విచిత్రమైన గ్రంథాలు ఉద్భవింప జేశారు...వేదాంత విచారము, కవిత్వము... కాని వీరికవిత్వం షేక్స్పియరు కవిత్వంతోటి తుల తూగగలదా?......... విచిత్రాతి విచిత్రమైన శిల్పం ఉంది. ఆలయనిర్మాణం ఉన్నది. ఈ మాత్రమూ లేక పోతే హిందూదేశంయొక్క గొప్ప ఏమిటి?......

పైగా గ్రీకుశిల్పంతో, రోమకచిత్రలేఖనంతో డోరిక్కు, కారిన్థియను, రోమక, గాతిక్కు నిర్మాణాలతో ఈయాలయాలు తులతూగగలవా?.........

పైగా వీళ్లు రంగులవాళ్లు. లాటిను జాతులైతే నేమి, స్లావికుజాతులైతేఏమి, యూదుజాతులవాళ్లయితే నేమి? మాఘియార్లయితే నేమిటి? రంగువాళ్లకన్న ఎక్కువకాదూ?......

రంగులవాళ్లు నీగ్రోలకన్న కొంచెం నయం...

"మేరీ! నీ ఆలోచనలకు ఒకపెన్నీ ఇస్తాను. ఏమిటీ ఒకటే ఆలోచన? నీ నీలం కళ్లలో కొన్నివందల ఆలోచనలు సుళ్లు తిరిగిపోయినవి. నువ్వు తేరిపార చూస్తున్న ఆ కుఱ్ఱవాడు అప్పుడే వేరోచోటకు వెళ్లాడు" అని మార్గరెట్టు మేరీభుజంమీద చేయి వేసింది. మేరీ మొదటిమాటకే ఉలిక్కిపడింది. మార్గరెట్టు మాటలు విన్నకొద్దీ ఆమెచెంపలలోకి అరుణ వర్ణాలు పోటెత్తుకు వచ్చినవి. ఆమె కళ్లలో సిగ్గులు అలమినవి.

మేరీ— "మార్జీ! నేను ఓప్రశ్న అడుగుతాను. నీ హృదయపూర్వకమయిన జవాబు ఇవ్వాలి.

మార్గరెట్టు — "ఓసీ వెర్రిపిల్లా! నే నెప్పుడయినా నా అభిప్రాయాలను దాచుకున్నట్టు నీ వెరుగుదువా?"

మేరీ— నీ బండతనానికే నీ వంటే అందరూ భయపడుతారు. హైందవజాతికన్న ఆంగ్లజాతి ఉత్తమమయినదా కాదా?"

మార్గ— "ఇదా నీ ప్రశ్న! ఇన్నేళ్లు నా సావాసం చేసి ఇప్పుడు ఆప్రశ్న అడుగుతున్నావు! వారెవా!—ఏవిధంగా గొప్ప దంటావు? సామ్రాజ్యం స్థాపించటంలోనా, అన్యాయాలు చెయ్యటంలోనా?"

మేరీ— "ఒక జాతికీ ఇంకొకజాతికీ అనేక విషయాలలో భేదా లుంటా యంటావా లేదా? ఆ భేదాలలో ఒకజాతి ఎక్కువా ఒకజాతి తక్కువా అవుతుందా లేదా?"

మార్గరెట్టు— "జాతికీ జాతికీ భేదా లుండవచ్చు. ఆ భేదాలలో హెచ్చులూ తగ్గులూ ఉండవచ్చు. అంతమాత్రంచేత ఒక జాతి గొప్పది, ఒకజాతి హీనమయినది, ఒకజాతి ఎక్కువది, ఒకజాతి తక్కువది అనేది మాత్రం నేను ఈషణ్మాత్రమూ నమ్మను. ఆలా నమ్మే వాళ్లను చూస్తే నాకు సంపూర్ణమయిన విచారం అని మాత్రం చెప్పగలను,

వారంతా అక్కడినుంచి కదలి, పాడుపడిపోయిన ఆ రంగమంటపంలోకి వెళ్లారు. అక్కడ ఒక స్తంభంలో చెక్కిన దివ్య నటరాజమూర్తివిగ్రహాని కెదురుగుండా కూర్చుని ఆబొమ్మయొక్క ప్రతిరూపాన్ని చిన్న చిత్రలేఖన పుస్తకంలో వ్రాసుకొంటూ ఆ యువకుడు వాళ్లకు మళ్లీ ప్రత్యక్షమయాడు. ఆ విగ్రహంయొక్క అద్భుత సౌందర్యానికి, ఆశుద్రవాని దీక్షకు ఏదో పరమశ్రుతి వాళ్లకు గోచరించింది. ఆనృత్యంలో ఉండే విచిత్రత, భావం ఎవరు తమకు చెప్పగలరు?

ఒక్క అముకునిముషములు వాళ్లు నిశ్శబ్దంగా ఈ దృశ్యం చూస్తూ నిలబడ్డారు. పదిమందీ పదిస్థలాలకు, అప్పుడే కాలిజోళ్లు టక్కుటక్కున చప్పుడుచేసుకొంటూ, వివిధవిగ్రహాలు, ద్వారబంధము, వితానశిల్పము, నందిని, ఏనుగులను తిలకిస్తూ చెదరిపోయినారు.

అతి సన్నని గొంతుకలతో శిల్పాన్నిగురించి వ్యాఖ్యానాలు సాగించడం మొదలుపెట్టారు. చువ్వున విశ్వేశ్వరరావు లేచాడు. అతనికళ్లు విస్ఫులింగాలు రాలుస్తున్నవి.

"హిందువుల పవిత్రమైన దేవాలయాలన్నా కూడా మీకు ఈ మహాత్మ్యం గౌరవం లేదే? సంగనా చిల్లా కాలిజోళ్లు తొడుక్కొని అపశ్రుతిశబ్దాలు మారుమోగిస్తూ, ఈ దేవాలయం అపవిత్రం చేశారే. ఈపవిత్ర శిలానృత్యమూర్తిసన్నిధానాన్ని శిల్పసత్యానికై అన్వేషిస్తున్న ఓమనుష్యునిపట్లయినా మీకు ఇంత దయన్నా లేదే. మీ ఆ యెత్తుముకమలకింద ఎంతకాలం మా భారతీయహృదయాలు చిమ్మటగొట్టాలలా రక్తాలు చిమ్ముతూ ఉండగా నలిపి నలిపి తొక్కగలరు?"

—అని సుప్పిడి చూపిస్తూ "మీ ఆఖరుదినాలు వచ్చాయి. ఏపూంజీవాదాలవాళ్లయినా ఇంగ్లీషువాళ్లకు మెలిమొగుళ్లు, హిట్లరు, ముస్సోలినీ — వాళ్ల కడుపులు చల్లగా! ఆంగ్లజాతి ఈశతాబ్దాలపాపపుమంటల్లో పడి భగ్నమయి పోయే — — —"

మార్గరెట్టు — చిరునవ్వుతో — "ఏమయ్యా! క్షమించు. ఇది పాడుదేవాలయంకదా అని జోళ్లు తొడుక్కు వచ్చాం. పాడుదేవాలయం అయితేమాత్రం ఇది పవిత్రమయిన శిల్పదేవాలయం. జోళ్లు విడిచి రావలసిందే. ఈశిల్పానికి మేము కొత్తవాళ్ల మవడంచేత అర్థం చేసుకోవడానికని మాట్లాడుకున్నాము. మనస్ఫూర్తిగా మా అందరి తరఫున మిమ్మల్ని క్షమాపణ వేడుతున్నాను. మీబొమ్మ అయినదాకా, పైనే తిరిగి వస్తాము. ఈపట్టులోపలికి వచ్చేటప్పుడు జోళ్లు తీసేవస్తాము" అని చిరునవ్వు నవ్వుతూ తన జట్టు యావన్మందితోనూ రండని సైగచేసి వాళ్లతో పైకి పోయింది.

ఖస్ ఖస్సని బుసలు కొట్టుతూ మాట్లాడిన విశ్వేశ్వరరావు విభ్రాంతిపొంది, తనది జయమో అపజయమో నిర్ణయించుకోలేకపోయాడు. అందాలు పుణికిపుచ్చుకొన్న ఆ శ్వేతబాలిక చిరునవ్వు నవ్వుతూ తన వైపున వారచూపులు ప్రసరింపజేసి వెళ్లిపోయింది.

"ఎంత అందంగా ఉన్నది? శ్వేతజాతుల్లో అందమయిన వాళ్లుంటారా? దేహసౌష్టవంలో భారతనారీమణులు ప్రపంచంలోని తక్కిన స్త్రీలకన్న అందమయినవాళ్లు కారా? ఒకవేళ, బాహ్యసౌందర్యంలో కొందరు పాశ్చాత్యజాతుల స్త్రీలు హైందవనారీమణులతో సమానమైనా హెచ్చయినా అంతస్సౌందర్యంలో వాళ్లు ఎట్లా పోలగలరు? కాని ఈ అమ్మాయి ఏవో శిల్పసౌందర్యాలను సేకరించుకొన్నది."

అయినా వీళ్లసంగతి? విశ్వేశ్వరరావు గబగబ రెండంగల్లో వేరే పక్కన వున్న దేవాలయంలోని శిల్పం చూస్తూఉన్న ఆయువతీమండలి దగ్గరకుపోయి వాళ్లకు జోహారించి,

"నన్ను మీరంతా క్షమించాలి. ఈశిల్పాన్నిగురించి నేనంతా మీకు చెప్పడానికి మీరు అనుజ్ఞయిస్తే మీరు నన్ను క్షమించినట్లు ఎంచుకొంటాను" అని పలికినాడు.

మార్గరెట్టు నవ్వుతూ "అలాగే రండి, కొంచెం చెప్పండి. మాకృతజ్ఞత అందుకోండి" అన్నది.

ప్రతీశిల్పం దగ్గరికీ వాళ్లను తీసుకువెళ్లి దానిని గూర్చి విశ్వేశ్వరరావు చక్కనిభాషలో గంభీరమయిన భావంతో విపులంగా చెప్పాడు. కొద్దివాక్యాలలో భారతీయ శిల్పలక్షణాలనుగురించి వాళ్లకు బోధప

చాడు. భారతీయశిల్పానికీ పాశ్చాత్యశిల్పానికీ ఉండే తేడాలు అనర్గళంగా ఉపన్యసించాడు.

"ఇక్కడినుంచి మీరు ఎక్కడికి వెడతారు" అని ప్రశ్నించాడు అతడు.

మేరీ — "అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటాలు మాత్రమే చూశాము. వార్ధా వెళ్లి గాంధీమహాత్ముని ఆశ్రమంలో పదిహేనురోజు లున్నాము. అక్కడి నుంచి తిన్నగా అనుమకొండ, ఒరంగల్లు చూసి ఇక్కడికి వచ్చాము. హిందూదేశము యావత్తూ చూడాలని సంకల్పం ఉంది."

విశ్వే — "అట్లయితే ఇక్కడినుండి అమరావతి, నాగార్జునికొండ చూసుకొని అక్కడనుంచి హంపి, బిజాపూరు, బాదామి, హర్పనహళ్లి యాత్రలు సేవించుకొని, పెనుగొండ, తాడిపత్రి, లేపాక్షి వెళ్లి మైసూరికి వెళ్లండి. మైసూరులో హళేబీడు, బేలూరు, శ్రవణబెళగొళా యాత్రలు సేవించిన వెనుక అరవదేశం, మలయాళదేశయాత్రలు సేవించవచ్చు. నేనున్నూ లేపాక్షి వరకు మీతో వస్తాను — మీకు నారావడం ఆక్షేపణ లేకపోతే."

౭

వాళ్లతో మైసూరుదాకా యాత్రలు సాగించాడు విశ్వేశ్వరరావు ఎక్కడో అణగిఉన్న అతనిలోని మర్యాదంతా ఉబికివచ్చింది. మార్గరెట్టుకూ విశ్వేశ్వరరావుకూ అహింస, జాతిభేదాలు, కళలు, సాహిత్యమూ మొదలయిన విషయాల్ని గురించి వాదాలు జరుగుతూ ఉండేవి. విశ్వేశ్వరరావు కోపం విపరీతరూపం తాల్చేది. ఆతడు మేరీ అందం చూచి భరించలేకపోయేవాడు.

అతనిలోని క్రూరత్వము లోలోన గాలివాన రేగింది. మింగబోయే కప్పను పాము వెంబడించినట్లు వాళ్లతోకూడా ఆతడు ప్రయాణాలు తీర్చినాడు.

వాదనలోని కరకుతనమూ విజ్ఞానమూ ఆతనిలో వెలుగు, నీడలు అయ్యాయి.

ప్రతివాదనవిషయంలోనూ ఆతనిద్వేషం ఉడుకెత్తుకుని, ఉబుకెత్తుకుని పరవళ్లుతొక్కుతూ ప్రవహించింది. అది 'గైయిసరు'లా వేడినీటిఊట. ఆకసం అంటేటట్లు గబుక్కున వస్తూ ఉండేది.

ఆతనికున్న అపారజ్ఞానం ఆ పాశ్చాత్యస్త్రీలను ఆశ్చర్యంలో ముంచింది. ఆతని ద్వేషానికి వాళ్లలో కొందరు ఒణికిపొయ్యారు. ప్రతిభారతీయ యువకుడు ఇల్లాగే ఆంగ్లేయులను ద్వేషిస్తున్నాడా?

నెల్లీ మార్గరెట్టుతో అనేకసార్లు "ఎందుకు ఈ రాక్షసుణ్ణి కూడా తిప్పుకోవడం" అని కోపంతో వాదించింది. మేరీతప్ప తక్కినవాళ్లు ఆమెవాదాన్ని బలపరచారు కాని మార్గరెట్టు చిరునవ్వు నవ్వుతూ,

"నా ప్రియబాలికల్లారా! నాకు పాలంపేటగుళ్లో ఒకదీక్ష అంతరాత్మలోంచి ఉద్భవించింది. రెండురాత్రిళ్లు ప్రార్థనతో ఆభావాన్ని సత్యబద్ధమైందా, కాదా అని భగవంతుని ప్రశ్నించుకున్నాను. ఈ విషయం యావత్తు గాంధీమహాత్మునకు వ్రాసుకున్నాను. ఆయన జవాబు-నన్నాశీర్వదిస్తూ- రానివ్వండి. ఈ బాలకుడు మనల్ని చంపుతాడా? చంపనీ. ఈలాంటివాళ్ల ద్వేషానికి మనం ఆహుతి అవడం ఎంత విచిత్రమైన, పవిత్రమైన దానము. ప్రేమతో బలిదానం - ఈ ఉద్యమాన్ని అరికట్టదా?"

అని అరమూతలైన చూపులతో దివ్యహాస నృత్యాలైన పెదవులతో పలికింది.

వెంటనే మేరీ ఆమెను గాఢంగా కౌగిలించుకుంది.

"ప్రియ! నాకున్న అనుమానాలు పటాపంచలు చేశావు. ఈరాత్రి ఒకరహస్యం నీతో చెప్పి నా హృదయతాపం ఉపశమనం చేసుకుంటాను" అని అన్నది.

తక్కినవాళ్లంతా "ఏమిటి మేరీ! గాంధిగారు రహస్యాలు ఉండకూడ దన్నారుకాదా?" అని ఒత్తిడి చేశారు.

చిరునవ్వు నవ్వుతూ మేరీ "తొందరపడకూడదు. స్పష్టత పొందని ఆలోచనను అప్పుడే వ్యక్తంచేయలేను. అది సరిగాదూ? మార్గీ!" అని మార్గరెట్టు వైపు చూసింది నవ్వుతూ.

"అలాగే మేరీ."

అందరూ నవ్వుతూ బేలూరు ప్రయాణం ఆరభ్యారు.

విశ్వేశ్వరరావు వాళ్లదగ్గిర శెలవు తీసుకుని గబుక్కున మదరాసు తిరిగి వచ్చాడు.

౫

దారిపొడుగునా మేరీకన్యమూర్తే ఆతని ఎదట మేఘశకలంలా గోచరిస్తున్నది. పువ్వుని కమ్మిన నల్లని తుమ్మెదలా ఆతనిద్వేషం ఆతనిహృదయము చుట్టూ ఝుమ్మని తిరగడం ప్రారంభించింది. ఆతని హృదయ పుష్పముఖ్యాన అల్లరిచేయకుండా తేనెలు తాగుతూ, దాగుకుంటూ ఏదో ఒకభావం, ఏదో ఒక కోర్కె, ఏదో ఒక అనుభూతి...

మేరీమాటలు, మేరీపాటలు, మేరీనడక, మేరీ వాదన, మేరీ శిల్పహృదయం...... ఆమె భారతీయ శిల్పదేవాలయంయొక్క ప్రథమప్రాంగణంలోకి ప్రవేశించింది.......

"ఎందుకు ఈ దేవాలయానికే ఆమె రావాలి? ఆమె ఆ హీన పాశ్చాత్యశిల్ప శిథిలత్వంలోనే పొర్లాడనీ. ఎవ రామె భారతీయ మహాశిల్పసత్యాన్ని గోచరింప చేసుకోనే అధికారం సంపాదించడానికి......

"పోనీ ఈ నీచస్త్రీలను తన దేశం వదలి. వాళ్లతో పాటు తన దేశసౌభాగ్యం తనకే ఉండనీ. దేశంలోని సువర్ణరాసులు, దేశంయొక్క మహాసౌభాగ్యమైన అభిమానమూ, మానమూ, స్వేచ్ఛా తస్కరించుకు పోయింది పోక, ఈ కజిన్సులు, ఈ హానెల్సులు, ఈ క్రామరెట్టులూ, ఈ కూల్డ్రేలు, ఈ గిల్లులు, ఈ మేరీలు మాశిల్పం కూడా తస్కరించుకుపోవాలి......"

ఆతని కళ్లు విషవాయువులు వీచే నాభిసుమాలయ్యాయి. ఆతని పెదవులు పళ్లల్లో ఎలకబోనులా బిగుసుకుపొయ్యాయి... ...

ముష్టి పట్టి అతడు బల్లను గట్టిగా గుద్దినాడు...

వాళ్లతో ఉన్నప్పుడు తన కంత పిరికితనమెందుకో? వాళ్లను బాధపెట్టలేకపోయినాడు. వాళ్లకు అంత సేవచేయడమేమిటి తాను! వాళ్ల సేవకుడిలా టిక్కెట్లు కొన్నాడు, బళ్లు మాట్లాడాడు. కూడా వెళ్లి ప్రతి శిల్పంయొక్క అర్థమూ, అందమూ, ఆనందమూ వర్ణించి చెప్పాడే! ఎంత చచ్చుహృదయం అయిపోయింది?

మేరీకన్య తన్ను మంత్రంవేసినట్లు తిప్పిందే? తియ్యటి గొంతుకతో కబుర్లు చెబుతోంటే ఏదో మమతతో, కాంక్షతో, గాఢ సంతోషంతో విన్నాడు కబుర్లు....

ఇప్పటికీ ఆరోజున జరిగిన ఒకవిషయం ఒళ్లు జలజల మనిపిస్తుందే. ఆరోజున తాను లేపాక్షి చిత్రలేఖనం శిల్పం అతిమాధుర్యంగా వర్ణిస్తూ, వాళ్లందరికీ హృదయాలు ఉప్పొంగచేసినమాట నిజం. ఆరాత్రి వెన్నెట్లో లేపాక్షి బసవయ్యను తిలకిస్తూంటే తనకళ్లు చెమరించిన మాటా నిజం. ఆ ఉన్నత, ఉత్తమశిల్పంపక్క తాను ఒక చిన్నశిల్పంలా అయిపోయిన మాటా నిజం. కాని... తనవెనకనే... వచ్చి... ఆ మేరీకన్య... తన రెండు బుజాలమీదా చేతులు వేసి... "వెన్నెట్లో శివునిలా నిలబడ్డావు పార్వతికోసమా విశ్వేశ్వర్?" అని ప్రశ్న వేస్తూ, నావీపున... ఆమెహృదయం తాళగతులు లయింపగా ఆని... ఒకనిముషం... ఒకేనిముషం... పక్కకు వచ్చి నిలుచున్నది... ...తనకు గలిగిన పులకరాలు— ఒళ్లు వేడి, హృదయంలో మత్తు... ఏమో... ఏమో... అతి అతిభావాలు! వీళ్లు సైరను (తియ్యనిపాటతో మోహం పెట్టి తమమంత్రంలో పడవేసికొని రక్తం పీల్చే గ్రీకు ఢాకినీ) వనితలా?...

ఆమేరీ?... ఏమి ఆమెఅందం... ఎందుకు వాళ్లని తిట్టుకోడం... "ఓయి వెఱ్ఱిమృగపు విశ్వేశ్వరరావూ! నువ్వు వట్టి వాజమ్మవు... నీఅగ్ని చల్లారింది, నీ హృదయం చచ్చింది. నీ అభిమానం అధోగతి పాలయింది. నీదేశభక్తి కుళ్లిపోయింది. లే... ఏడు. నెత్తి నోరూ బాదుకొని, గాజులు తొడిగించుకొని, వంట చెయ్యి, జజ్జమ్మా, చచ్చమ్మా!"

౬

"మేరీ! ఆచిన్నఫొటో బాగా తీశావే. ఏమిటే అతిగా పరికిస్తున్నావు, ఆవిశ్వేశ్వరరావు బొమ్మను?" అని నెల్లీ మేరీని పలకరించింది.

వాళ్లంతా మధుర దేవాలయం చూస్తున్నారు. తిరుమల నాయకుని మహాభవనం చూశారు, మంటపం చూశారు. తెప్పాకులం చూశారు. 'మేల'గోపురాలు పరిశీలించారు.

మీనాక్షి గుడియెదుట ఉండే లోనిమండపం లోని విగ్రహాలని సందర్శిస్తున్నారు. తిరిగి తిరిగి నృత్య మూర్తి అయిన శారదాదేవివిగ్రహంకడకు వచ్చారు. ఆ విగ్రహంయొక్క చిత్రం ఓటి-విశ్వేశ్వరరావు-చక్కని రేఖాచిత్రం తన స్కెచ్చిపుస్తకంలో వ్రాసుకొని ఉన్నాడు. ఆ రేఖాచిత్రం చాలా అందంగా చిత్రించినాడు. "ఆచిత్రం, అందుతో పాటు ఆతనూ ఈవిగ్రహం చూస్తే జ్ఞాపకంవస్తే ఆతనికి తెలియకుండా నేను తీసిన ఆతని ఛాయారూపం చూస్తున్నాను నెల్లీ!" అన్నది మేరీ.

నెల్లీ పకపక నవ్వింది.

"ఓసి వంగనాచీ! నాదగ్గర దాపరికం వద్దు. థియాసఫిస్టులలా భారతీయులంటే ప్రేమించడం నేర్చుకున్నావేమిటి?" అన్నది.

"నీమాటలు విపరీతంగా ఉన్నాయి నెల్లీ!"

"నిన్ను నేను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాను. ఒకటిలే, నువ్వు ఇదివరకే ఎందరి యువకులతోనో-జాగ్రత్తగామాత్రం - సరదాగా గడిపావు. ఒక ళ్లిద్దర్ని ప్రేమించావనుకున్నావు. అల్లాగేనా ఈ విశ్వేశ్వరరావు అంటే వెఱ్ఱి?"

"నెల్లీ! నీకు ఈ జన్మలో వేళాకోళంగుణం పోయేది ఎప్పుడే?"

తిరిగి వాళ్లంతా రహదారిబంగాళాకు చేరుకున్నారు.

నెల్లీ మళ్లా మేరీని ఒంటరిగా కలుసుకొని "మేరీ! నువ్వు మార్జీతో ఆనాడు ఏమి మాట్లాడింది నాకు తెలియజేయకపోయినా నేను ఊహించుకోలేక పోలేదు. మార్జీ జాతికీ జాతికీ ఎంత తేడా లేదని వాదించినా, ఒకపథంలోంచి ఆవాదన ఒప్పుకున్నా స్త్రీపురుషసంబంధం విషయంలో నువ్వు కోటి వాదనలు తీసికొనిరా నన్నుమాత్రం మీరు ఒప్పించలేరు" అని తీవ్రముగా వాదించింది.

"ఇప్పుడు నీ సలహా అవసరమే వొచ్చింది నెల్లీ! నువ్వు కాదూ కూడదు వాదిస్తాను అంటావూ? అయితే నీవాదనే నీకు అప్పజెప్పతాను. సాధారణ హీనవిషయాలలో జాతితేడాలకు నాకు అభ్యంతరం లేదుగాని, ఉత్తమమైన కళలవిషయంలో, స్త్రీపురుషసంబంధం విషయంలో, భగవంతుని విషయంలో జాతిమతభేదాలు ఎంతమాత్రమూ ఉండకూడదని నాఘట్టివాదన. అంతే అంటుంది మార్జీ. అది కాకుండా నేను ఒకరహస్యం మార్జీతో మాట్లాడాను అన్నావు. అది ఏమిటో విను. విశ్వేశ్వరరావు వెఱ్ఱిగా దేశభక్తి అని అనుకొని అతిద్వేషహృదయం కలవాడై ఉన్నాడు. మహాత్ముని ఆదేశప్రకారం ఆయువకుడికి మనం అహింసామహావ్రతదీక్ష ఇవ్వాలి అని నేను మార్జీతో చెప్పితే, ఆమె ఎంతో సంతోషంతో 'సెహబాష్' అన్నది. అది ఆనాటిసంగతి —నీకు తృప్తి అయిందా?"

"ఏమి చేశారు మీరు? అతడు మరికాస్త ద్వేషంతో మండిపోయాడు. మీరు వాడిదారిని వాణ్ణి పోనీక గాంధీ అంతవాడు చేయలేని పిచ్చపిచ్చ పనులు చేయబోయి పీకలమీదకు తెచ్చుకుంటారు."

౧౦

మధురనుంచి యాత్రలు సాగించుకుంటూ వారు చెన్నపట్టణం చేరుకున్నారు. అక్కడ మైలాపూరు కపాలేశ్వరాలయాన్ని చూచారు. ఆ దేవాలయంలో విశ్వేశ్వరరావు పిళ్లకు ఎదుర్కోలు ఇచ్చారు. నెల్లీ మేరీని చూచి పరిహాసంగా చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు విశ్వేశ్వరరావు చూచాడు. దాని భావమూ గ్రహించాడు. మనస్సులో ఉగ్రుడై పోయాడు.

విశ్వేశ్వరరావును చూడగానే మేరీగుండె కొట్టుకుంది. మార్గరెట్టు ఆనందంతో విశ్వేశ్వరరావును బహూకరించి తమతో రమ్మని ఆహ్వానించింది.

ఆగుడి చూస్తూన్నంతసేపూ విశ్వేశ్వరరావుకూ మార్గరెట్టుకూ భారతీయజీవితాన్ని గురించి వాదోపవాదాలు పెరిగాయి.

భారతీయులు అఖండప్రయత్నంచేసి శుభ్రజీవితం అలవాటు చేసుకోకపోతే ఈఉత్కృష్టజాతి అంతా నశించిపోతుంది అని మార్గరెట్టు.

ఈ హీనస్థితికి కారణం ఆంగ్లేయులే అనిన్నీ, దేశాన్ని పీల్చి పిప్పిచేస్తే ఈలాంటి జీవితం తమకు వచ్చిందనీ ఆతని వాదన.

అక్కణ్నుంచి అందరూ కలిసి 'కానమెరా' హోటలుకు వెళ్లారు. అందరూ తమ తమ గదులకు దుస్తులు మార్చుకునేందుకు పోయారు. హోటలుహాలులో మార్గరెట్టూ విశ్వేశ్వరరావూ వాదించుకుంటూ కూచున్నారు.

"మీరు హిందూదేశక్షేమమే నిజంగా కోరేవారయితే, అందుకనే లండనులో భారతీయ సంపూర్ణ స్వరాజ్యసమితి ప్రారంభించి పనిచేస్తున్నవారయితే మీవాళ్లంతా సంపూర్ణస్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లేందుకు ఎందుకు ప్రయత్నంచేయరు?"

"ఏమండీ! అందరూ ఒకేఉద్దేశం కలవాళ్లవుతారా? మాదేశమొత్తంమీద ఏవేయిమందో ఈతక్షణమే భరతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలనేవాళ్లు ఉన్నారు. పదివేలమంది ఏకొద్ది సంవత్సరాలల్లోనో ఇవ్వవచ్చుననేవాళ్లు ఉన్నారు. అసలు ఎప్పటికి ఇవ్వరాదు అనేవాళ్లు కోట్లు."

"అందుకనే దెబ్బకు దేవేంద్రలోకం అన్నట్లు భరతదేశపు ముష్టియొక్క బరువూ, బలమూ చూపిస్తేనే మీవాళ్లు లొంగుతారని మానమ్మకం."

"ఆలాటివాళ్లు ఏలక్షో రెండులక్షలోగా ఉండేది?"

"తక్కినవాళ్లంతా భరతదేశం బ్రతికి ఉన్నన్నాళ్లూ ఆంగ్లేయపాదధూళి శిరస్సున ధరించే బ్రతుకాలిఅని నమ్మేవాళ్లనా మీఉద్దేశం?"

"అది కాదయ్యా, అహింసాధర్మంవల్ల సంపూర్ణ స్వరాజ్యం స్థాపించాలి అని నమ్మేవాళ్లు."

"అయితే ఏవి వారిపనులు, వారి ఫలసిద్ధి?"

"నమ్మకానికీ, నమ్మకానికి తగినట్లు జీవితాన్ని అనుసరించేటట్లు చేయగలశక్తి ఉండడానికీ ఎంతో దూరం ఉంది. ఆదూరం క్షణక్షణమూ మహాత్ముని నాయకత్వంక్రింద తగ్గించుకుంటున్నారు భారతీయ ప్రజాలోకము."

"ఓహోహో. ఇది మాకు ఒక ఆంగ్లస్త్రీ బోధించడం!"

"హేళన ఎందుకు వీరపురుషుడుగారూ? నా జీవిత సర్వస్వముతో నమ్మినవిషయం అది. అది నాబోధ కాదు. మహాత్ముణ్ణి నేను అర్థంచేసుకున్న రీతి అది.

ఆమె మాటలలోని నిర్మలత్వమూ, ఆమెకళ్లల్లోని నిశ్చలత్వమూ, ఆమె దరహాసంలోని కరుణత్వమూ ఆతనికి సిగ్గు పుట్టించాయి.

"క్షమించండి మార్గరెట్టుగారూ! నాలోని ఆవేశంచేత అన్నమాటలు. మీ నిష్కల్మషహృదయము నాకు సంపూర్ణంగా ద్యోతకము అయ్యింది. అహింసవల్ల లోకంలో శాంతి అవతరిస్తుందని అనుకోడం శుద్ధవెఱ్ఱి అని నా నమ్మకం. అహింసాతత్వార్థమూ, దాని తర్కమూ జ్ఞానమూ నా కేమాత్రమూ హృదయానికి తట్టలేదు. ద్వంద్వాతీతుడైన భగవంతునికి ద్వంద్వాలు రెండూ సమంకదా! అల్లాంటప్పుడు భగవంతుడు అహింసాస్వరూపుడు అని వాదించడం ఏమిటి? అహింసే మోక్షార్థకం ఏమిటి?"

"అది కాదయ్యా, భగవంతుడు ద్వంద్వాతీతుడనే శ్రీ మహాత్మజీకూడా చెప్పేది. స్థితప్రజ్ఞుడైనవాడూ భగవంతునిలో లీనమైనవాడూ వాడు సిద్ధుడు. సాధకుడు ప్రపంచంలో ఉన్నాడు. ప్రపంచంలో ఉన్నవాళ్లకు ఆ ద్వంద్వాలలో ఒకటి మంచిది ఒకటి చెడుగు. వెలుగు మంచిది, చీకటి బాధ. ఆ వెలుగుయొక్క తత్వం ప్రేమ విశ్వేశ్వరరావుగారూ..."

"ఈ సిద్ధాంతాలన్నీ విన్నాను, నాకు నవ్వు వస్తాయి. అందులో మా వేదాంతాలలో పుట్టి పెరగని మీరు ఎల్లా తెలుసుకోగలరు?"

"ఇదివరదాకా పంటకు తేనిభూములు ఎరువు వేసి దున్నితే ఏలాంటి పంట వేసినా అద్భుతంగా పండవటయ్యా?"

అక్కణ్ణుంచి విశ్వేశ్వరరావు విడిదికి చక్కా పొయ్యాడు.

౧౧

వాళ్లతో ఆంధ్రదేశం అంతా తిరిగి, తనఊరు కూడా వాళ్లను తీసుకుని వెళ్లినాడు విశ్వేశ్వరుడు.

ద్వేషము అనుకుంటూనే ఆతడు వాళ్లకు చూపించిన గౌరవమూ, వాళ్లకిచ్చిన ఆతిథ్యము వర్ణనాతీతమైనాయి. విశ్వేశ్వరరావుతల్లితో వాళ్లు ఎంతో ప్రేమతో వ్యవహరించారు. విశ్వేశ్వరరావుతల్లి వాళ్లను హృదయాని కద్దుకుంది.

ఆమె సత్సంగములో చేరడంవల్ల తన పూర్వాచారపరాయణత్వాన్ని దయాల్‌బాగు పవిత్రభూములలో శ్రీప్రేమగురునికే సమర్పించిన మనిషి. సర్వదా భజనా, ధ్యానములలో భగవంతుని అర్చించే భక్తురాలు.

ఆమెకు ఈ ఆంగ్లస్త్రీలు తన ఇంటికి రావడం పరమసంతోషమైంది. ఆమెను ఆ ఆంగ్లవనితాసమూహము హృదయమార ప్రేమించింది.

మేరీ టెంపిల్ ఆమెతో విశ్వేశ్వరరావును దగ్గర ఉంచుకుని ఆతను భాషాంతరీకరణం చేస్తూండగా విశ్వేశ్వరుని బాల్యచరిత్ర అంతా అడిగి తెలుసుకుంది. విశ్వేశ్వరుని జైలుకష్టాలు, ఆతని సహజప్రేమహృదయము, అతడు ఎల్లప్పుడూ ఏదోరూపంగా హీనజనులకు చేసే సేవా ఇంకా ఇంకా ఎన్నో తెలుసుకుంది. తాను భారతీయజీవనంలోని అద్భుతఘట్టాలను దర్శించిన చిత్రాలు ఆమెకు చూపించింది. విశ్వేశ్వరరావుకు తెలియకుండా ఆతని చిన్ననాటి ఫోటోలు రెండు ఆమె నడిగి తీసుకుని దాచుకుంది. ఆతని ప్రతిరూపాలు ఆతని వివిధభంగిమలతో, ఆతని వివిధకళలలో చిత్రించుకున్నది. ఆబొమ్మలు ఆమె ఎవరికీ చూపించలేదు.

* * * *

ఆంధ్రదేశమంతా తిరిగి వాళ్లు భువనేశ్వరము చేరుకున్నారు. భువనేశ్వరములో విశ్వేశ్వరుడు తాను చిత్రించిన "జగన్నాథరథము" అనుచిత్రమును ఆంగ్లస్త్రీమండలానికి చూపించాడు.

వాళ్లు ఆ బొమ్మను చూచి భయపడిపోయారు. వాళ్లుఆతనిహృదయంలో ఎంత ద్వేషము, ఎంతక్రోధము, ఎంత హింస కూడుకట్టుకొని పేరుకుపోయిందో చూసి గజగజలాడారు. మేరీ టెంపిల్ కళ్లవెంట బొటబొట పదహారు ముక్కలు రాలినవి. ఆమె అన్నది—

"మమ్మల్నింత ద్వేషిస్తున్నావా విశ్వేశ్వర్?" అని......

ఆ ముక్కలకు విశ్వేశ్వరుడు ఎంతో సిగ్గుపడిపోయాడు. ఆ సిగ్గుతో దహించుకుపోయాడు. కుంగిపోయాడు. ఆమె కంటసడులు పోయి ఆ బిందువులు అమృతపుచినుకులై ఆతని హృదయాన్ని దహించివేసినవి. అమృతమే కాలకూటమైనది. వాళ్ల ఎదుట నిట్టనిలువున కుంగిపోయిన మోముతో కాళరాత్రులు కమ్మిన కళ్లతో భయంకరదోషి ననుకుంటూ విశ్వేశ్వరుడు దహించుకుపోయాడు......

ఎవ్వరూ మాట్లాడలేదు. గబగబ మేరీ గదిలోనికి పారిపోయింది. మరచుర విశ్వేశ్వరరావును అతికోపంతో చూసి నెల్లీ ఆ బాలిక వెనకాలే వెళ్లబోతే మార్గరెట్టు ఆమెను కనుసన్నతో ఆపుచేసింది.

చేతులు కట్టుకొని తూలుతూ విశ్వేశ్వరుడు తన బసకు వెళ్లిపోయాడు.......

ఆతనిలో గాలి దుమారాలు రేగాయి. ఆ దుమారాలను అణిచివేస్తూ ఆమె కంటి బిందువులు గాలివాన అయ్యింది...

ఆ సాయంత్రందాకా విశ్వేశ్వరుడు తిండి తినకుండా తన బసలోనే పండుకొని ఉన్నాడు.

అతనిచుట్టూ చీకట్లు అలముకొన్నాయి. ఆతనిలో చీకట్లు గడ్డకట్టుకుపోయినవి. ఆతని రక్తప్రవాహము పూర్తిగా ఆగిపోయినట్లయింది.

....

ఆ సాయంకాలపు ధూప్‌ఛాహాఁలో మెల్లగా అడుగులువేస్తూ ఒంటరిగా విశ్వేశ్వరరావు తలవాల్చుకొని పరశురామేశ్వర దేవాలయానికి పోయి వెలుగు వెనక సిలహౌటీ(నీడరూపం) గా కనబడే. ఆ గుడిని చూస్తూ చూచీ చూడని చూపులతో చదికిలంబడి ఉన్నాడు.

....

ఇంతలో చీకటి ఎక్కువౌతూ ఉన్న ఆసందెలో ఆతని బుజంమీద ఒక చల్లనిహస్తం.

ఆచేయి ఒకపావురము ఒకబురుజుమీద వాలినట్లు వాలింది.

ఆతని ఒళ్లు మరుపులలో తూలింది.

ఆతడు జలదరించిపోయాడు.

ఆతని హృదయం కరడుతనంలోంచి కరిగిపోయింది.

ఆతడు నెమ్మదిగా వెనక్కు తిరిగాడు.

ఆతనివెనక మెరిసిపోయే నక్షత్రాలాంటి కళ్లతో తన్ను కలలచూపులచూస్తూ మేరీ టెంపిల్ కూచునిఉంది.

ఆమె చెయ్యి ఇంకా ఆతని బుజంమీద ఉంది.

....

ఏదో మత్తు విడినవానిలా చటుక్కున విశ్వేశ్వరుడు ఆమెవైపుకు మరలి ఆమె రెండు చేతులూ తన చేతులతో అదిమి పట్టుకొని

"మేరీ! మేరీ! నువ్వు నా జీవితంలోకి ఎందుకు ప్రత్యక్షమయ్యావు. నా ప్రేమ విశ్వాలను పొర్లి విశ్వాతీతమైన శూన్యాలు ఆక్రమిస్తూంది............నన్ను నువ్వు ప్రేమించగలవా ?"

అని ఆమె ఎదుట తలవంచినాడు అతడు.

ఆమె కరిగిపోయింది.

"ఎందుకు ప్రేమించలేను ?"

"నిజంగా ! నిజంగా !"

ఆమెను అతివేగంతో తనకౌగిలిలోకి లాక్కున్నాడు............

ఆమె ఆతనికౌగిలింతలో వివశఅయిపోయినది.

ఆమె ఆతని మోమును అగాధ ప్రేమతో చూచినది.

ఆతడామె పెదవులను దివ్యమైన, నిర్మలమైన, దీర్ఘమైన ముద్దుకొన్నాడు......

ఆమె కనకాంబరకాంతిరూపమైన, గంధరాజపుష్పపరీమళాత్మకమైన, వేదనాతీతమైన, మహాపవిత్రమైన ముద్దు నాతనికి వరమిచ్చినది...

"ఆ నృత్యమూర్తి కడ క్రోధమూర్తివైన నిన్ను చూసినప్పుడే నా మనస్సు, నా ప్రాణము నీకు అంజలి ఘటించాయి, భారతీయుడా!"

"ఇది నిజమా మేరీ బాలికా ! నా దివ్యరాజ్ఞీ. ఆంగ్లేయయువతి ఈదీనుణ్ని ప్రేమించడం అసంభవం కాదూ ! నేను ఇది మహాస్వప్నం అనుకుంటున్నాను."

"నారాజా ! నాప్రాచ్యపతీ ! నీహేళన నిన్నింక వదలలేదూ?"

"హేళనకాదు మేరీప్రియతమా ! హేళనా ! ఈ పరశురామేశ్వరుణ్ణి, ఈ ప్రథమరాత్రికుణాల్ని, ఈ భూమిగడ్డను అడుగు...అడుగూ!"

....

ఆ రాత్రి బంగాళాలో మార్గరెట్టు వరండాలో పడకకుర్చీమీద కూర్చుని సైహూ జీవితచరిత్ర చదువుకుంటున్నప్పుడు మేరీ నడుముచుట్టూ విశ్వేశ్వరుడు చేతిని చుట్టినీ, విశ్వేశ్వరునిభుజంమీద మేరీ తల వాల్చినీ మార్గరెట్టుఎదుటకు వచ్చి ఆమె పాదాలకడ ఆ ప్రేమికులు మోకరిల్లారు.

మార్గరెట్టు చటుక్కున నుంచొని దివ్యానందము మోమున నృత్యంచేస్తుండ, కళ్లు పవిత్రకాంతులు ప్రసరిస్తూఉండగా "నాహృదయం కోర్కె ఈడేరింది నా బిడ్డలారా!" అంటూ వాళ్లిద్దరి తలమీదా రెండుచేతులూ వేసింది....................................

౧౨

ఈవార్త విని నెల్లీ భూమిమీద ఫట్‌ఫట్టని చప్పుడవుతూవుండగా, జోళ్లపాదాలతో గబగబ ధడధడ భూమిమీద బాదింది.

"నేను ఒప్పుకోను. ఈ వ్యవహారాన్ని పళ్లతో, గోళ్లతో పీకి చీల్చి చెండాడుతాను. ఈ సంయోగం కానివ్వను. మేరీగార్డియను కుత్తరం వ్రాస్తాను. కోర్టుల్లో దెబ్బలాడుతాను. ఆంగ్లప్రభుత్వానికి విజ్ఞప్తిపెట్టి అడ్డగిస్తాను. సిగ్గు! సిగ్గు!"

అని అల్లరిచేసింది. ఘొల్లున ఏడ్చింది, పక్కమీదపడి దొర్లింది.

మార్గరెట్టు ఆమెను చూచి, ఆమెపక్కనే మంచంమీద కూచుని, ఆమెను తనకౌగిలిలోకి తీసుకొని గట్టిగా హృదయాని కదుముకొని, ప్రేమార్ద్రకంఠంతో "నెల్లీ! నీకు హిస్టీరియా వస్తోంది. ఇంత నీవు అల్లరి చేయడానికి బదులు ఆనందంతో ఉప్పొంగి పోవలసింది —ఇటువంటి సంవిధానం సంభవించినందుకు. వందల కొద్ది సంవత్సరాలు భారతజాతీయతను, ఐశ్వర్యాన్ని పీల్చిపిప్పిచేసిన మనం ఇలాంటి నివేదనలతోకాని నిష్కల్మష చరిత్రలము కాలేము" అని అన్నది.

నెల్లీ రౌద్రంతో లేచి నుంచుని "నీ వెర్రి మొర్రిమాటల నిక చాలించు. నీ శుద్ధ తెలివితక్కువ తనంచేత ఈలాంటి దుష్టసందర్భం దాపురించింది. నీవు బట్టిమెదడడు లేని మూర్ఖురాలవు. ఈ మేరీ అమాయికురాలు, బడాయికోరున్ను. సర్వప్రపంచానికి నాయకమైన ఆంగ్లజాతికి తీరనికళంకము అవమానము తెచ్చిపెడుతున్నారు. — మేరీ! నీ అందమైన, సౌష్టవపూర్ణమయిన, దివ్యమయిన నీదేహాన్ని, నీ గౌరవాన్ని వాసనవేసే కుళ్లులో కూరుతావా? గాఢమైన పశుత్వం ఉందేమో నీలో ఎక్కడో, నీలాంటి పశువులయిన నవజాతికి చెందిన అమెరికాస్త్రీలు కొందరు నల్లటి నీగ్రో వెధవలకు సమస్తార్పణలూ చేస్తారు...

అని ఆడుపెద్దపులిలా గోండ్రించిపోయినది.

ఆ మర్నాడు ఆజట్టును వదలిపెట్టి నెల్లి తనసామానుతో బొంబాయి చేరినది. ఆ వెనకనే బయలుదేరు స్టీమరుమీద ఇంగ్లండు వెళ్లిపోయినది............

తక్కినవాళ్లంతా మేరీని కౌగలించుకొని "నీవు ఆదర్శసమంచితవైన బాలికవు తల్లీ! భగవంతుడు నీ ఈనూతన తపస్సును సర్వసుఖప్రదంగా ఆశీర్వదించును గాక" అని ఆమె మూర్ధము మూర్కొన్నారు.

....

౧౩

"మార్జీ!, ఇంగ్లీషుభార్యతో కాపరంచేయడానికి తగిన ధనం లేదు. సంపాదించేమార్గాలూ లేవు."

"ఓయి వెఱ్ఱివాడా! మేము భారతీయస్త్రీల మవుతున్నాము. నీలో అయిక్యమయిపోయే మేరీ ఎంత అందంచేస్తుందో చూస్తూఉండు. ఆమెకు సాలుకు మూడువేలపౌనులు రాబడివచ్చే ఆస్తి ఉంది. అది ఆమె స్వంతం. తక్కిన ఆస్తి తనకు అక్కర లేదంటుందట."

"నేను సాలుకు వేయిరూపాయిలుమాత్రమే తెచ్చుకోగలను. ఆమె సాలుకు నలభై వేలరూపాయిలు తెస్తే ఏలాగు? దరిద్రునకు వివాహం ధర్మమా మార్జీ!"

"ఓయివెఱ్ఱివాడా! ప్రేమ ప్రధానం. ధనం కాదు. నువ్వు అహింసావ్రతాచరణం చేయడమే పదివేలు. ఇన్నిశతాబ్దాలనుంచి దోచుకొన్న ధనం మేము మీకు ఎన్నిరకాలుగా తిరిగి ఇవ్వాలో!"

విశ్వేశ్వరుని ప్రేమ మహాకావ్యమై లోకమోహనమైంది.

ఆంగ్లయువతులు, ఆంగ్లయువకులకడనుండి ప్రేమను ఈఅద్భుతస్వరూపంతో చూరగొని ఉండరు.

ఆమెను ఒకరోజున పద్మాక్రులు చెక్కిన పీఠంమీద అధివసింపజేసి, పదివేలపూవులతో పూజించినాడు విశ్వేశ్వరుడు.

కళలు పుణికి పుచ్చుకున్న చీరలు, ఖరీదు కలవి కొనివచ్చి ఆమెను ధరింప జేసి ఆమెకడ మోకరిల్లాడు.

ఆతని కళ్లలోనిపూజ ఉదయసూర్యునివర్ణాలులా, పూర్ణిమాజ్యోత్స్నలులా అలిమివేసినది.

"నీసౌష్టవమూర్తిత్వానికి కాదు, నీస్నిగ్ధబాలికాత్వానికి కాదు, నీహిమాచ్ఛశరీరకాంతికి కాదు, నీఆంగ్లశాక్జనుజాతిత్వానికి కాదు, నీదివ్యసౌందర్యానికి కాదు మేరీ! నిన్ను పూజించేది, నువ్వు నా దేవివి! నా మోక్షానివి, నా నిత్యవు.

నిన్ను ముద్దు పెట్టుకుని నీకు మలినము ఇస్తానేమో నన్నభయం...

నువ్వు కలగా మాయం కావుకదా?

నువ్వు సూర్యునికుమారితవు కాదుకదా?

ఇన్నాళ్లు ఈ ద్వేషం నా హృదయంలో ఉన్నందుకు ఫలితానివా, నన్ను ద్వేషరహితుణ్ని చేయడానికి వేంచేసిన దివ్యసాన్నిధ్యానివా?

ఆతడు పట్టుశాలీ పాంటూరుధోవతి ధరించి, పాంటూరులాల్చీ ధరించి ఆమెకడకు వచ్చినపుడల్లా ఆమె చిన్నపరుగుతో ఆతన్ని వచ్చి కంఠము బిగియార గా బాహులతలు చుట్టివేసేది.

ఆతని విశాలఫాలంలో వేదబుక్కులు పనసలు పాడుతున్నవని ఆమె అనుకునేది.

ఆతనికళ్లలో పరమశ్రమణకుడైనను బుద్ధభగవానుని శాంతకాంతులు పుంజీభూతాలయి దర్శనమిస్తున్నవని ఆమె ఒణికిపొయ్యేది.

ఆతని మూర్తిలో గ్రీకుదేవుడు అపోలో ప్రతి ఫలించలేదు. సర్వసౌందర్యస్వరూపాలు ప్రోగుచేసికొన్న భారతీయదివ్యమూర్తి ప్రత్యక్షమయ్యేవాడు ....

"మీభరతదేశానికి నేను నూతనయాత్రికురాలిని విశ్వా! నా చేయిపట్టుకుని ఈ దివ్యజ్యోత్స్నలో నడి పించుకొనిపో" అని ఆమె అన్నది.

....

నా రిద్దరూ ఒంటిగా ఉన్నంతసేపూ ఆమె అతని ఒళ్లో ఉండవలసినదే! వారి హృదయాలు రెండూ లయలు శ్రుతులు కావలసినదే.

౧౪

మేరీ తక్కినవారితో ఇంగ్లండు వెళ్లి తనవ్యాపా రాలన్నీ సర్దుకుని తిరిగివచ్చేటట్లూ, అంతవరకూ విశ్వేశ్వరుడు శివగ్రామఆశ్రమంలో ఉండేటట్లూ ఏర్పాటుచేసికొన్నారు.

మేరీ మార్గరెట్టు మొదలయినవాళ్లతో బొం బాయి వెళ్లిపోయినది.

ఒంటిగా ప్రాణ మేలోకానికో పోయినవానిలా ఉస్సురంటూ ఆశ్రమంలో ఉన్నాడు విశ్వేశ్వరుడు.

అతివేగంతో, అతిసున్నితంగా యిరువది నాలుగురకాల దారం వడకడం నేర్చుకో ప్రారంభిం చాడు.

అతిబాధతో ఇంకో చిత్రం ప్రారంభించాడు అతడు. ఉజ్జ్వలరూపయై, జగత్కల్యాణమూర్తియైన శాంతిదేవియొక్క చిత్రము. సర్వకష్టాతీతయైన, సర్వ ద్వేషాతీతయైన పరమప్రేమమూర్తి ద్వేషపూర్ణమైన ఈ ప్రపంచంలో ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క దివ్యవిధానాన్ని అహింసాస్వరూపమును నిర్ణయించు కుంటూ ప్రేమాపరావతారుడైన గాంధీ అహింసామార్గ మును అన్వేషిస్తున్నాడు.

ఆ మహాభావాన్ని సర్వవిధాలా ఉద్దీపింప జేయడం తనబోటివారి ముఖ్యధర్మము.

ఆ చిత్రం విచిత్రవేగంతో విజృంభింపసాగింది. నీలాలు, వంగపండుచాయలు, పాటలవర్ణాలు-

అయిదవరోజున సాయంత్రం ఒంటిగా ఆశ్ర మానికి అనతిదూరంలో ఉన్న ఎత్తుప్రదేశంమీద కూర్చుని విశ్వేశ్వరుడు మేరీదివ్యమూర్తిని ఊహించుకుంటూ పులకితదేహుడౌతూ, ఈ రెండు నెలలూ ఎట్లా భరించడ మా అని ఆలోచించుకుంటూ, పరవశమైన స్వప్నాలు కంటూ కూచునిఉన్నాడు.

దశమినాటి చంద్రు డప్పుడే నీలాకాశంలో పైననే ఉన్నాడు. చంద్రకాంతులూ, సంధ్యాకాంతు లూ విన్యాసమందుతూ ఉన్నవి.

చటుక్కున చంద్రకిరణాలలాంటి రెండుచేతులు ఆతని మెడను చుట్టుకొన్నవి.

ఆతడు గుండె కొట్టుకుంటూ వెనక్కు తిరిగాడు.

"మేరీ! మేరీ! కలా?" అంటూ వెనక్కు తిరిగాడు.

"కలకాదు, నేను నిజాన్ని ప్రియా! నిన్ను వదలి ఇంగ్లండు వెళ్లలేకపోయాను. రెండునెల లయినవెనక మార్జీ నావ్యాపారాలన్నీ సర్ది మన...మన...వివాహానికి వస్తుందట..."

"ఓ మేరీ! ఇంత ప్రేమకు నే నెట్లా తగుదును దేవీ!"

వెన్నెలవెలుగు దీప్తి తాల్చినది.

ఆశ్రమంలో ప్రార్థనకు అందరూ చేరినారు.

....